సాక్షి
ఖమ్మం
సోమవారం ׀ 9 ׀ జనవరి ׀ 2023



నెట్‌బాల్ విజేత 'ఖమ్మం'

ఖమ్మంలో రెండు రోజులు జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల, మహిళల నెట్‌బాల్ పోటీల్లో విజేతలుగా ఖమ్మం జట్లు నిలిచాయి. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 12°

వాతావరణం

జిల్లాలో సోమవారం రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది. తెల్లవారుజామున మంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

కేసీఆర్ హయాంలోనే ఆర్యవైశ్యులకు గుర్తింపు



వాసవీ క్లబ్ సభ్యులతో ఉప్పల శ్రీనివాస్

ఖమ్మంగాంధీచౌక్: కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఆర్యవైశ్యులకు గుర్తింపు లభించిందని రాష్ట్ర టూరిజం చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన వాసవీ క్లబ్ జిల్లా కేబినేట్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాజకీయంగా ఆర్యవైశ్యులకు పదవులిచ్చారని తెలిపారు. ఉప్పల్ భాగాయత్‌లో ఐదెకరాల భూమి కూడా ఇచ్చారని చెప్పారు. ఆర్యవైశ్యులు వ్యాపారంలోనే గాక సామాజిక కార్యక్రమాల్లోనూ ముందంజలో ఉండాలన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఐఏఎస్ చదువుతున్న 23 మందికి ఆర్థిక సాయం అందించామని చెప్పారు. సమావేశంలో వాసవి క్లబ్ ప్రతినిధులు యాద నాగేశ్వరరావు, దోసపాటి వెంకటేశ్వరరావు, దారా మల్లికార్జున రావు, కేబినేట్ కార్యదర్శి దార నర్సింహారావు, కోశాధికారి గుమ్మడివెల్లి శ్రీనివాసరావు, దోసపాటి లక్ష్మి, ఉప్పల శారద, జిల్లా కేంద్ర గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ రామ్మోహన్‌రావు, బిజ్జాల శ్రీనివాస్ గుప్తా, ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్, గంగిశెట్టి జగదీశ్ కుమార్, లింగయ్య, శ్రీనివాస్, హన్మంత రావు, శివకుమార్, సుజాత, కృష్ణమూర్తి, జగన్‌మోహన్‌రావు, వేణుగోపాల్, రాధాకృష్ణ, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

నేను సాఫ్ట్‌వేర్.. హార్డ్‌వేర్‌గా మార్చకండి

- వైరా ఎమ్మెల్యే రాములునాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరా: తాను ఇప్పటివరకు సాఫ్ట్‌వేర్‌లాగా పనిచేశానని, తనలో ఉన్న హార్డ్‌వేర్‌ను బయటకు తీయొద్దని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై హార్డ్‌వేర్ ప్రయోగిస్తానని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రలోభాలకు లొంగి పార్టీ మారడానికి కార్యకర్తలు ఎవరూ ప్రయత్నించవద్దన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని, కఠిన చర్యలకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ వల్ల ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారని, ఇప్పుడు ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని చెప్పారు. వైరా నుంచి తిరిగి తనను రెండోసారి గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు దార్నా శేఖర్, బాణాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు విశ్వేశ్వరరావు, డాక్టర్ కోటయ్య, పవిత్రకుమారి, లక్ష్మీబాయి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు పుష్యమి పట్టాభిషేకం



స్వామివారి పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి పట్టాభిషేకం నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం పట్టాభిషేక మహోత్సవాన్ని కనుల పండువగా జరిపారు. ఆదివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

18న జిల్లాకు కేసీఆర్



ప్రారంభానికి సిద్ధమైన సమీకృత కలెక్టరేట్ భవనం

నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించనున్న సీఎం

- సమీకృత కలెక్టర్ కార్యాలయంలో 45 శాఖలు
- కలెక్టరేట్ పక్కనే భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు
- మెడికల్ కళాశాలకు పాత కలెక్టరేట్ భవనం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఈనెల 18న ఖమ్మం జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం వద్ద నిర్మించిన నూతన సమీకృత కార్యాలయాల భవన సముదాయాని(కలెక్టరేట్)కి కేసీఆర్ ప్రారంభోత్సవం చేయనున్నారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో ఆయా జిల్లాల్లో నూతన సమీకృత కలెక్టరేట్‌లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ జిల్లాలతో పాటు పాత జిల్లాల్లో కూడా సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. జిల్లాలో నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నిర్మాణానికి ప్రభుత్వం రూ.53.20 కోట్లు మంజూరు చేసింది. 2018లో కలెక్టరేట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కలెక్టరేట్ నిర్మాణ పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ, కలెక్టర్, ఇంజనీరింగ్ అధికారులతో నిరంతరం సమీక్షిస్తూ పనులను వేగవంతం చేయించారు. సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఈనెల 18న ప్రారంభోత్సవం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం కలెక్టర్ కార్యాలయంగా సేవలందిస్తున్న భవనాన్ని మెడికల్ కళాశాలకు కేటాయించారు. కలెక్టరేట్ కార్యాలయం సమీకృత కలెక్టరేట్‌కు మారగానే పాత భవనాన్ని వైద్య విధాన పరిషత్‌కు అప్పగించనున్నారు.

భారీ బహిరంగ సభకు సన్నాహాలు..

18న సమీకృత కలెక్టరేట్‌ను సీఎం కేసీఆర్ ప్రారంభించనుండగా.. అదే రోజున కలెక్టరేట్ పక్కనే భారీ బహిరంగ సభ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. తొలుత సీఎం గ్రౌండ్ ఫ్లోర్‌లో నిర్మించిన కలెక్టర్, డీఆర్‌ఓ, అడిషనల్ కలెక్టర్ చాంబర్‌లను ప్రారంభిస్తారు. కలెక్టర్ చాంబర్‌ను ప్రారంభించిన తర్వాత ఆ చాంబర్‌లో కలెక్టర్‌ను కూర్చోబెట్టి జిల్లా పరిపాలనను ప్రారంభించనున్నారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడేలా ఏర్పాట్లు చేయనున్నారు.

మూడు అంతస్తుల భవనం..

సమీకృత కలెక్టరేట్ నిర్మాణం కోసం 2017 మే 1న రూ.35.38 కోట్లతో పరిపాలన అనుమతులు ఇస్తూ ప్రభుత్వం 245 జీవోను విడుదల చేసింది. అయితే 2020 సెప్టెంబర్ 10న దీనిని సవరించి 418 జీవో ద్వారా రూ.53.20 కోట్లకు పరిపాలన అనుమతులు ఇచ్చారు. కలెక్టరేట్ నిర్మాణం కోసం రూ.21.76 కోట్లు వెచ్చించి 20.10 ఎకరాల భూమి సేకరించారు.1,59,307 చదరపు అడుగుల్లో కలెక్టరేట్ నిర్మాణం చేపట్టారు. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్ 53,940 చదరపు అడుగుల్లో, మొదటి అంతస్తు 50,874 చదరపు అడుగుల్లో, రెండో అంతస్తు 54,493 చదరపు అడుగుల్లో నిర్మించారు. ఈ భవన సముదాయాన్ని నిర్మించేందుకు కేపీసీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్)కు ఇవ్వగా.. ఎస్‌ఆర్ఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్)కు సబ్ లీజుకు ఇచ్చారు.

సీపీ పరిశీలన

రఘునాథపాలెం: నూతన కలెక్టరేట్ సముదాయాన్ని ఈనెల 18న సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నట్లు సమాచారం అందడంతో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచన మేరకు సీపీ విష్ణు ఎస్ వారియర్, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మంత్రి పీఏ రవికిరణ్ తదితరులు ఆదివారం సందర్శించారు. ప్రారంభం రోజు బహిరంగసభ ఏర్పాటు, వాహనాలు లోపలికి రావడం, బయటకు వెళ్లడం తదితర రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లపైనా సమీక్షించారు.



కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న సీపీ విష్ణు ఎస్ వారియర్, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మంత్రి పీఏ రవికిరణ్ తదితరులు

సమీకృత కలెక్టరేట్ భవనంలో 45 శాఖలు..

సమీకృత ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో కలెక్టర్ చాంబర్, జాయింట్ కలెక్టర్ చాంబర్, అడిషనల్ కలెక్టర్, డీఆర్‌ఓ, మీటింగ్ హాల్ (25 మందికి సరిపోయేలా), ఎన్‌ఐసీ, వీడియో కాన్ఫరెన్స్, కలెక్టర్ స్టాఫ్‌కు సంబంధించిన కార్యాలయాలు ఉంటాయి.

- ఫస్ట్ ఫ్లోర్‌లో స్టేట్ చాంబర్ (మంత్రులు, అధికారులు విజిట్ చేసినప్పుడు), వీసీ హాల్, ఇతర శాఖలకు సంబంధించిన కార్యాలయాలు ఉంటాయి.
- సెకండ్ ఫ్లోర్‌లో వీసీ హాల్, ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఉన్నాయి.
- కలెక్టరేట్ ఆవరణలో రోడ్లు, ఫ్లాగ్ పోస్ట్, ఎస్‌టీపీ, అండర్‌గ్రౌండ్ సంపు, కార్ పార్కింగ్ ప్రాంతం, లాన్ ఏరియా, ఎంట్రెన్స్ పోర్టికో, సబ్ స్టేషన్, కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేశారు.
- మొత్తంగా అధికారులు, సిబ్బంది అంతా సుమారు 550 మందికి సరిపడేలా ఈ కలెక్టరేట్ భవన నిర్మాణం జరిగింది. కలెక్టరేట్ ఆవరణం అంతా గ్రీనరీతో తీర్చిదిద్దారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్ ముందు బస్ స్టాప్ కూడా ఏర్పాటు చేశారు.

'ఆశ'ల సేవలు ప్రశంసనీయం

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



సభలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ఆశ కార్యకర్తలు అందిస్తున్న సేవలు మరువలేనివని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్‌కేవీ ఆధ్వర్యంలో గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల సంఘం (ఆశ) జిల్లా 3వ మహాసభలు వీడీవోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించగా.. మంత్రి పువ్వాడ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక పథకాలను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందిస్తున్నారని, ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా కోవిడ్ కాలంలో ఆశ కార్యకర్తలు అందించిన సేవలు మరువలేనివన్నారు. పేదలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని చెప్పారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా పరీక్షలు, మందులు అందజేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బస్తీ దవాఖానలను సైతం పేదల ముంగిటికి తీసుకొచ్చినట్లు చెప్పారు. వీటిలో 56 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల అమలులో స్మార్ట్ ఫోన్‌లు ఆశా వర్కర్‌లకు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌కేవీ రాష్ట్ర నాయకులు రాంబాబు, జిల్లా అధ్యక్షురాలు కరుణ, నాయకులు పాల్వంచ కృష్ణ, పాషా పాల్గొన్నారు.

గంగుల మల్లయ్యకు పలువురి నివాళి



మల్లయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే సండ్ర, ఎమ్మెల్సీ మధు, కూరాకుల నాగభూషణం తదితరులు

ఖమ్మం మయూరిసెంటర్ : రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ తండ్రి గంగుల మల్లయ్య ఇటీవల మృతిచెందగా, జిల్లాకు చెందిన పలువురు ఆదివారం కరీంనగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి గంగుల కమలాకర్‌ను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోత్ హరిప్రియా నాయక్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, ఆర్‌జేసీ కృష్ణ తదితరులు ఉన్నారు.

ఎల్లలు దాటినా.. ఎనలేని సేవలు



ఖమ్మం రూరల్ మండలంలో స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న చేతన ఫౌండేషన్ సభ్యులు (ఫైల్)



- దాతృత్వం చాటుకుంటున్న ఎన్‌ఆర్‌ఐలు
- విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం
- నేడు భారతీయ ప్రవాసీ దివస్

ఖమ్మంసహకారనగర్: జిల్లా నుంచి వివిధ ప్రాంతాల్లో ఎన్‌ఆర్‌ఐలుగా స్థిరపడిన వారు అనేక మంది తమకు వచ్చిన ఆదాయంలో ఎంతో కొంత సమాజ సేవకు ఉపయోగిస్తూ దాతృత్వం చాటుకుంటున్నారు. తాము పుట్టిన ప్రాంతానికి ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. కొందరు విద్యారంగాభివృద్ధికి పాటు పడుతుండగా, మరి కొందరు వృద్ధ, అనాథ ఆశ్రమాలకు సాయం అందించడం, వైద్య సేవల్లో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు.

సేవల్లో ముందంజ 'చేతన'..

అనేక ఏళ్లుగా సేవే పరమావధిగా చేతన ఫౌండేషన్ ముందుకు సాగుతోంది. ఈ సంస్థ సభ్యులు నాలుగు అంశాలను ఎంచుకుని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యావ్యవస్థ మెరుగుపడితే అనేక మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయనే ఉద్దేశంతో అనేక ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులను ఏర్పాటు చేశారు. ఇందుకోసం 50 టీవీలు, 600 బెంచీలు, గిరిజన ప్రాంత విద్యార్థులకు రెండు వేల స్కూల్ బ్యాగ్‌లు, 10 వేల నోట్ పుస్తకాలు, ఎగ్జామినేషన్ కిట్లు, ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులకు శానిటరీ ప్యాడ్‌లు అందించారు. కరోనా సమయంలో ఆన్‌లైన్ తరగతుల కోసం విద్యార్థులకు 1000 లాప్‌ట్యాప్‌లను సైతం అందజేశారు. ఇక గ్రామీణ, పట్టణ ప్రాంతాల నిరుపేద మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చే లక్ష్యంతో 1000 కుట్టుమిషన్లు, 30 గ్రైండర్లు పంపిణీ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు వృద్ధ, అనాథాశ్రమాలకు భోజనాలు, కూరగాయలు సరఫరా చేస్తున్నారు. ఆదివాసీ, గిరిజన విద్యార్థులకు 10వేల దుప్పట్లు, 3 వేల స్టడీ సోలార్ ల్యాంప్‌లు కూడా అందించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో అమెరికాలోని పేద విద్యార్థులకు సైతం 20వేల నోట్ పుస్తకాలు, 3వేల పాఠశాల బ్యాగ్‌లు పంపిణీ చేశారు.



పాఠశాలలో టీవీలు పంపిణీ చేస్తున్న ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సభ్యులు (ఫైల్)

విద్యాభివృద్ధే లక్ష్యంగా..

ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థికి విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందించేలా డిస్ట్రిక్ట్ ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ కృషి చేస్తోంది. డిజిటల్ క్లాస్ రూమ్‌ల ద్వారా మెరుగైన విద్య అందుతుందనే ఉద్దేశంతో ఇప్పటి వరకు 1500 పాఠశాలలు, 200 అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ సేవలను విస్తరించారు. పలు పాఠశాలలకు 8500 డ్యూయల్ బెంచీలను అందించారు. ఈ విద్యా సంవత్సరంలో 52 పాఠశాలలకు 780 బల్లలు అందించారు. 2017 నుంచి 2022 వరకు సుమారు 30 వేల మంది విద్యార్థులకు మానసిక, ప్రేరణ శిక్షకులతో కౌన్సిలింగ్ ఇప్పించారు. జిల్లాలోని 25 పాఠశాలలకు రూ.8.50 లక్షలతో మౌలిక వసతులు కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రూ. 3 లక్షలు ఉపకార వేతనాలుగా అందించారు. బాసర ఐఐఐటీలో ప్రవేశాలు పొందిన ఐదుగురు విద్యార్థులకు ఆరేళ్ల పాటు ఫీజు చెల్లించారు. 8మంది బీటెక్ బాలికలకు కళాశాల ఫీజులు, ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఇంకా మహిళాభివృద్ధి కోసం సుమారు 8 వేల మందికి కుట్టుమిషన్లు అందజేశారు.

సేవలోనే సంతృప్తి

సేవ చేయడం ద్వారానే సంతృప్తి లభిస్తుంది. మన వంతుగా సమాజానికి ఎంతో కొంత చేయాలనే ఆకాంక్షతో ముందుకు వెళ్తున్నాం. జాతి, మత, కులం, భాషా, సాంస్కృతిక, రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా సమాజ సేవ కోసమే చేతన ఫౌండేషన్‌ను స్థాపించాం. జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాలు, దేశాల్లోనూ సేవలు అందిస్తున్నాం.

– వెనిగళ్ల రవి, చేతన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు

ఆనందంగా ఉంది

సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ సేవలు మరింత విస్తృతం చేయాలనే ఆలోచనతో ముందుకెళ్తున్నాం. ప్రధానంగా విద్యను ఎంచుకున్నాం. నేను కొణిజర్ల మండలం బస్వాపురం గ్రామానికి చెందినవాడిని అయినా అమెరికాలో ప్రముఖ ఫార్మాస్యుటికల్ కంపెనీలో సైంటిస్టుగా పని చేస్తున్నా. మిత్రులతో కలిసి ఫౌండేషన్ ద్వారా సేవ చేస్తున్నా.

– దొడ్డపనేని హరినాథ్‌బాబు, డిస్ట్రిక్ట్ ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ అధ్యక్షుడు

క్లుప్తంగా

పోలీసుల అదుపులో చోరీ నిందితుడు

ఖమ్మంఅర్బన్: నగరంలోని శ్రీనగర్‌కాలనీలో ఇటీవల తాళం వేసిన ఇంట్లో పట్టపగలు భారీ చోరీకి పాల్పడిన నిందితుడి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. చోరీకి పాల్పడిన దొంగ హైదరాబాద్‌లో ఉంటే పోలీసులు ఆరా తీసి అక్కడే అదుపులోకి తీసుకున్నట్లు ఇప్పటికే బంగారం రికవరీ చేసినట్లు, నగదు రికవరీ కోసం ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. నగదు, బంగారం కలిపి మొత్తం రూ.10 లక్షలకు పైగానే చోరీ అయినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై ఖమ్మంఅర్బన్ స్టేషన్‌లో కేసు నమోదైంది. చోరీ జరిగిన ఇంట్లో క్లూస్ టీం బృందం వేలి ముద్రలను సేకరించడంతో పాటు చోరీ జరిగిన సమయంలో ఇంటి చుట్టు పక్కల అపార్ట్‌మెంట్‌లో ఉన్న సీసీ కెమెరాల రికార్డులను ఆధారం చేసుకొని పోలీసులు విచారణ చేసి నిందితుడిని గుర్తించారని, పాత నేరస్తుడుగానే భావిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య

ఏన్కూరు: మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సాయి కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని రేపల్లెవాడ గ్రామానికి చెందిన వరదబోయిన పృథ్వీరాజ్ (24) కొన్నేళ్లుగా ఏన్కూరులో స్వీట్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పృథ్వీరాజ్ మద్యానికి బానిసై తిరుగుతూ ఆదివారం ఏన్కూరులోని అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ సాయికుమార్ పృథ్వీరాజ్ భౌతికకాయానికి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఉరి వేసుకొని వ్యక్తి బలవన్మరణం చెందిన ఘటన మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని సారథినగర్‌లో నివాసం ఉండే షేక్ జాన్‌పాషా (38) స్నానపుగదిలో మేకుకు వైరుతో ఉరివేసుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మూడో పట్టణ తానా ఎస్‌ఐ రఫీ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శ్రీచైతన్య కళాశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడగా తీవ్రగాయాలు కావడంతో కళాశాల బాధ్యులు తక్షణమే నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉన్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా విద్యార్థిని ఆత్మహత్యకు నిరసనగా కళాశాల ఎదుట పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పీవైఎల్, డీవైఎఫ్‌ఐ తదితర సంఘాల నాయకులు ఆందోళన నిర్వహించారు.

కేసు నమోదు

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ గ్రామానికి చెందిన రైతు నర్రా కోటయ్య కల్లంలో మిర్చి ఆరబోయగా శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు సుమారు 4 క్వింటాళ్ల మిర్చిని ఎత్తుకెళ్లారు. దీని విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

తిరుమలాయపాలెం: మండలంలోని ఎర్రగడ్డ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో మండల ఎస్‌ఐ వరాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా రెండు మోటార్ సైకిళ్లు, ఆటోతోపాటు రూ.3,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్న మరో ముగ్గురు వ్యక్తులు పారిపోయారు. పేకాట ఆడుతున్న నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ తెలిపారు.

ప్రెజర్ బాంబు నిర్వీర్యం..

చర్ల: మండలంలోని కొండెవాయి సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబును చర్ల పోలీసులు నిర్వీర్యం చేశారు. ఇందుకు సంబందించి వివరాలిలా ఉన్నాయి. కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న స్పెషల్ పార్టీ పోలీసులు కొండెవాయి అటవీ ప్రాంతంలో పోలీసులను లక్ష్యంగా చేసుకొని ఏర్పాటు చేసిన ప్రెజర్ బాంబును గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సీఐ అశోక్‌కుమార్ నేతృత్వంలో బాంబ్ డిస్పోజబుల్ టీం ఆ ప్రాంతానికి చేరుకొని బాంబును నిర్వీర్యం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మావోయిస్టులు చేపడుతున్న ఇటువంటి వికృత చేష్టలకు మూగజీవాలతో పాటు ఆదివాసీల ప్రాణాలు కూడా పోతున్నాయని చెప్పారు. ఇటువంటి దుశ్చర్యలను ప్రజలు, ప్రజాస్వామికవాదులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు ఖండించాలని ఆయన కోరారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర రూ.13,881

కలెక్టరేట్‌లో పల్లె ప్రకృతివనం

- పది ఎకరాల్లో తీర్చిదిద్దేందుకు కసరత్తు
- 30 వేలకు పైగా మొక్కలు నాటాలని నిర్ణయం



కలెక్టరేట్ సముదాయంలో పల్లె ప్రకృతివనం ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రఘునాథపాలెం: మండలంలోని వీవీ పాలెంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (నూతన కలెక్టరేట్) ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఇక్కడ సేకరించిన 22 ఎకరాల్లో భవన సముదాయం నిర్మాణానికి పది ఎకరాలు కేటాయించారు. ఇక ఇతర నిర్మాణాలు పోగా మరో పది ఎకరాల స్థలం ఉంటోంది. ఇందులో బృహత్తర పల్లె ప్రకృతి వనాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. తద్వారా పచ్చని మొక్కలతో కళకళలాడుతూ కార్యాలయాలకు వచ్చే వారిని ఆకట్టుకోవడం ఖాయమని పలువురు అధికారులు పేర్కొంటున్నారు.

నీడతో పాటు పూలు, పండ్ల మొక్కలు

నూతన కలెక్టరేట్ నిర్మాణానికి వీవీ పాలెంలో 22 ఎకరాల మేర భూమి సేకరించారు. అందులో పది ఎకరాల వరకు భవన నిర్మాణం జరిగింది. మిగిలిన స్థలంలో హెలీప్యాడ్, ఇతర నిర్మాణాలు పోగా ఇంకా పది ఎకరాల వరకు స్థలం ఉంటోంది. అందులో కలెక్టర్ ఆదేశాల మేరకు బృహత్ పల్లె ప్రకృతి వనం నిర్మాణానికి సిద్ధమయ్యారు. ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఈఓ శ్రీనివాసరెడ్డి, ఉపాధి ఏపీఓ పద్మయ్య నాయుడు ఆధ్వర్యంలో సర్పంచ్ మాధవి, కార్యదర్శి ఉపేందర్ పర్యవేక్షిస్తూ ఇప్పటికే పనులు ప్రారంభించారు. ఇప్పటికే కలెక్టరేట్ భవనం ఎదురు రోడ్డు వైపు స్థలంలో వందలాది మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. ఈ ప్రాంతంలో పచ్చని గడ్డితో గార్డెన్ ఏర్పాటు చేయనున్నారు. ఇక మిగిలిన స్థలంలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేయనుండగా, సుమారు 30 వేలకు పైగా మొక్కలు నాటాలనేది లక్ష్యం. అందులో నీడనిచ్చేవే కాకుండా పూలు, పండ్ల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు మిగులు భూమిని చదును చేసి పంచాయతీకి అప్పగించే పని ఒకటి, రెండు రోజుల్లో పూర్తి కానుంది. ఆ వెంటనే వివిధ రకాల మొక్కలను తెప్పించనున్నారు. 'కలెక్టర్ ఆదేశాలు, ఇతర ఉన్నతాధికారుల సూచనల మేరకు బృహత్ పల్లెపకృతి వనం అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాం.. ఖాళీ భూమి ఎంత అప్పగిస్తే అంతలో మొక్కలు నాటి సంరక్షిస్తాం.. చిన్నవి, పెద్దవి కలిపి 30 వేలకు పైగా మొక్కలు నాటాలనేది మా లక్ష్యం' అని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు.



కలెక్టరేట్ ఆవరణలో రోడ్డువైపు ఇప్పటికే నాటిన మొక్కలు

'రామదాసు' ఉత్సవాల

నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న సాధు రాధాకృష్ణమూర్తి

నేలకొండపల్లి: ఈ నెల 25 నుంచి జరగనున్న రామదాసు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని విద్వత్ కళాపీఠం అధ్యక్షుడు సాధు రాధాకృష్ణమూర్తి కోరారు. ఆదివారం రామదాసు మందిరంలో సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణకు అన్నివర్గాల సహకారం తీసుకోవాలని, రాజకీయాలకతీతంగా అన్నివర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని ఈ సందర్భంగా సూచించారు. సమావేశంలో ఎంపీటీసీ శీలం వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావు, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ రాయపూడి శ్రీనివాసరావు, కమిటీ ప్రతినిధులు జెర్రిపోతుల సత్యనారాయణ, నంచర్ల దేవీప్రసాద్, కోటేశ్వరరావు, దేవరశెట్టి వెంకటేశ్వర్లు, ఓరుగంటి నారాయణరావు, బి.రవీందర్, నూతక్కి ప్రసాద్, బాజా నాగేశ్వరరావు, పూజారి సౌమిత్రి రమేశ్ పాల్గొన్నారు.



మందిరం ఎదురుగా ఉన్న స్థలం

పాముల కలకలం



రామదాసు మందిరంలో పాము

రామదాసు మందిరంలో పాములు కలకలం సృష్టిస్తున్నాయి. ఒక పక్క రామదాజు జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న తరుణంలో మరోపక్క పాములు సంచరిస్తుండటంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. రామదాసు మందిరం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం చిట్టడవిని తలపిస్తోంది. ఇటీవలి కాలంలో అనేకసార్లు పాములు మందిరంలోనే సంచరించాయి. ఆదివారం ఓ పాము మందిరంలోని గోడ వెంట సంచరించింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆ స్థలాన్ని బాగు చేసి, విష సర్పాల నుంచి రక్షించాలని భక్తులు కోరుతున్నారు.

జీఎస్టీలో వడ్డీ పెనాల్టీల వేధింపులు

- ఏఐఎఫ్‌టీపీ జాయింట్ సెక్రటరీ ఎంవీజేకే కుమార్
- జిల్లా జీఎస్టీ నూతన కమిటీ ఎన్నిక



జిల్లా జీఎస్టీ నూతన కార్యవర్గ సభ్యులు

ఖమ్మంగాంధీచౌక్: వస్తు సేవా పన్ను (జీఎస్టీ) అనేది పరోక్ష పన్నుల చట్టమని, ఈ జీఎస్టీలో వడ్డీ, పెనాల్టీల వేధింపులు ఎక్కువగా ఉన్నాయని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రొఫెషనల్స్ సహాయ కార్యదర్శి ఎంవీజేకే కుమార్ అన్నారు. జిల్లా జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ 4వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం ఖమ్మం నగరంలోని హోటల్ భవాని గ్రాండ్‌లో సంఘం అధ్యక్షుడు బి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ.. వ్యాపారులు జీఎస్టీని వినియోగదారుల నుంచి వసూలు చేసి ప్రభుత్వాలకు చెల్లిస్తున్నారని, ఈ విధానంలో సమగ్ర అవగాహన కల్పించకుండా పన్నులు వసూలు చేస్తున్నారని తెలిపారు. జీఎస్టీ విభాగాలు వడ్డీలు, పెనాల్టీలు చెల్లించాలని వేధింపులు కూడా చోటు చేసుకుంటున్నాయని, జీఎస్టీలో సాంకేతిక సమస్యల సాధనకై జాతీయస్థాయిలో కృషి జరగాల్సి ఉందన్నారు. రాష్ట్ర ట్యాక్స్ ప్రొఫెషనల్స్ అధ్యక్షులు నగేశ్ రంగీ మాట్లాడుతూ.. ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ సెలవు దినాల్లో కూడా పనిచేయాల్సి వస్తోందని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఉల్లిబోయిన సైదులు మాట్లాడుతూ.. సంఘం కార్యకలాపాలను వివరించారు. జీఎస్టీ అంశాలపై జూమ్ మీటింగ్‌ల ద్వారా నిర్వహించిన కార్యక్రమాల గురించి వెల్లడించారు. అనంతరం జిల్లా నూతన అసోసియేషన్‌ను ఎన్నుకున్నారు. నూతన సంఘం అధ్యక్షులుగా కె.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కె.పవన్‌కుమార్‌లతో పాటు ఇతర పదవులకు ప్రతినిధులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అడ్వయిజర్ చుండూరు కోటేశ్వరరావు, కొమ్మరాజు పవన్ పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ కౌన్సిల్ సమావేశాన్ని ఉల్లిబోయిన సైదులు నిర్వహించారు.

దాతల సాయంతో ఆలయం అభివృద్ధి



జమలాపురం ఆలయంలో నిర్మించిన శ్రీఅయ్యప్పస్వామి ఆలయం



దాతలు తోట శ్రీనివాసరావు - కృష్ణకుమారి దంపతులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతి జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ అభివృద్ధి దాతల సహకారంతో జరుగుతోంది. ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో ప్రవాస భారతీయులు, తెలంగాణ, ఏపీలకు చెందిన పలువురు భక్తుల సహకారంతో పలు నిర్మాణాలు జరిగాయి. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో మధిర పట్టణానికి ప్రచారానికి విచ్చేసిన సీఎం కేసీఆర్ జమలాపురం ఆలయానికి రూ.10 కోట్లు నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు.

- వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో శ్రీబాలాజీ అన్నదాన సత్రాన్ని ఎన్‌ఆర్‌ఐ, ఏపీ రాష్ట్రం కృష్ణా జిల్లా వెల్వడం గ్రామానికి చెందిన లక్కిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి దంపతులు 2016 సంవత్సరంలో రూ.75 లక్షలతో నిర్మించారు. వారు అమెరికాలో స్థిరపడ్డారు.
- శ్రీఅయ్యప్పస్వామి వారి దేవాలయాన్ని 2004లో ఎన్‌ఆర్‌ఐ, ఏపీ రాష్ట్రం కృష్ణా జిల్లా వెల్వడం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ తోట శ్రీనివాసరావు - కృష్ణకుమారి దంపతులు రూ.60 లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించారు. ప్రస్తుతం వారు అమెరికాలో స్థిరపడ్డారు.
- ఆలయ రాజగోపురాన్ని 2005లో ఏపీ రాష్ట్రం కృష్ణా జిల్లా వెల్వడం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ దివంగత లక్కిరెడ్డి బాలిరెడ్డి రూ.30 లక్షలతో నిర్మించారు.
- ఎన్‌ఆర్‌ఐ చారుగుండ్ల నరేంద్ర 2006లో రూ.30 లక్షలతో కళ్యాణమండపాన్ని, అన్నదాన సత్రాలను నిర్మించారు. ఆయన అమెరికాలో స్థిరపడ్డారు.
- ఆలయంలో ధ్వజమండపాన్ని భీమవరం గ్రామానికి చెందిన స్వర్గీయ ఎన్‌ఆర్‌ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డి - వరలక్ష్మి దంపతులు 2002లో రూ.20 లక్షలతో నిర్మించారు.
- ఆలయ ప్రాంగణంలోని కోనేరును కృష్ణా జిల్లా గొట్టిముక్కల గ్రామానికి చెందిన వ్యాపారవేత్త గుదె వెంకటేశ్వర్లు 2016లో రూ.40 లక్షలతో నిర్మించారు. ఆయన స్వగ్రామంలోనే స్థిరపడ్డారు.

చికిత్స పొందుతున్న వ్యక్తులు మృతి

వేర్వేరు కారణాలతో ఆత్మహత్యాయత్నం చేసిన ఇద్దరు వ్యక్తులు ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందారు.

తల్లాడ: ఏన్కూరుకు చెందిన వెన్నా శ్రీనివాసరెడ్డి (30) డిసెంబర్ 30వ తేదీన తల్లాడ జిన్నింగ్‌మిల్ సమీపంలో పురుగులమందు సేవించాడు. గమనించిన బంధువులు శ్రీనివాసరెడ్డిని గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి అన్న వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ జె.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య దీపిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కడుపునొప్పి తాళలేక..

కారేపల్లి: మండలంలోని గాదెపాడు గ్రామానికి చెందిన మేకల రవి (42) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 2వ తేదీన ఇంటి వద్ద పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా ఆదివారం మృతి చెందాడు. మృతుని సోదరుడు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారేపల్లి ఎస్‌ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య లింగమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆటో రిఫ్రాక్టో మీటర్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం వైద్యవిభాగం : కంటి వెలుగు కార్యక్రమానికి ఆటో రిఫ్రాక్టో మీటర్ల కోసం వివిధ ఏజెన్సీలు, వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.మాలతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 12 ఆటో రిఫ్రాక్టర్లు అవసరమని, ఐదు నెలల అద్దె నిమిత్తం తీసుకుంటామని పేర్కొన్నారు. ఒక్కో రిఫ్రాక్టర్‌కు నెలకు రూ. 25 వేల చొప్పున చెల్లిస్తామని తెలిపారు. ఆసక్తి గల మెడికల్ ఏజెన్సీలు, వ్యక్తులు తమ వద్ద ఉన్న మిషన్ వివరాలతో కూడిన దరఖాస్తులను ఈనెల 11వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు డీఎంహెచ్ఓ కార్యాలయంలో సమర్పించాలని ఆమె సూచించారు.

శోకసంద్రంగా ఖిల్లా..

- ముగ్గురు యువకుల దుర్మరణంతో విషాదఛాయలు
- కలచివేసిన కుటుంబ సభ్యుల రోదనలు
- బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి పువ్వాడ
- మరణంలోనూ వీడని స్నేహబంధం



ప్రమాద వివరాలు ఆరాతీస్తున్న మంత్రి అజయ్‌కుమార్



ఎండీ ఇంద్దాత్ (ఫైల్) షేక్ సమీర్ (ఫైల్) షేక్ యాసిన్ (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: కారు ప్రమాదం జరిగిన ఘటనలో ఖమ్మం నగరంలోని ఖిల్లా ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు మరణించడంతో ఆ ప్రాంతం అంతా విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల రోధనలతో ఖిల్లా శోకసంద్రంగా మారింది. ఖమ్మం నగరంలోని ఖిల్లా ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇంద్దాత్ (21), షేక్ సమీర్ (21), షేక్ యాసిన్ (18), అర్షద్ అలీ, షేక్ కరీమ్, షేక్ సల్మాన్, మహ్మద్ అత్తార్, షేక్ ఆరీఫ్, మహ్మద్ సోహైల్ ఒకే వీధిలో నివాసం ఉంటున్నారు. వారంతా స్నేహితసులు, బంధువులు. సోహైల్ సోదరి ఒలిమా ఫంక్షన్‌కు ఇన్నోవా కారులో హైదరాబాద్‌లోని మొయినాబాద్ వెళ్లి తిరిగి ఖమ్మం వస్తున్న సమయంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత విజయవాడ–హైదరాబాద్ 65వ జాతీయ రహదారిపై కట్టంగూర్ మండలం యరసానిగూడెం గ్రామ శివారులో డివైడర్‌కు తగిలి ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారు పల్టీ కొట్టడంతో కారులోని ఇంద్దాత్, షేక్ సమీర్, షేక్ యాసిన్‌లు అక్కడికక్కడే మరణించారు. ఇక డ్రైవర్ అర్షద్ అలీ, ఎస్‌కే కరీమ్, ఎస్‌కే సల్మాన్‌లకు తీవ్ర గాయాలు కాగా.. ఎండీ సోహైల్, ఎండీ అత్తార్, ఎస్‌కే ఆరీఫ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారిని నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కుటుంబ భారాలను మోసేవారే..

కారు ప్రమాదంలో మరణించిన యువకులు పేద కుటుంబాలకు చెందిన వారే. వారు పని చేస్తేనే కుటుంబాలను పోషించేందుకు వీలుంటుంది. మహ్మద్ ఇంద్దాథ్, షేక్ సమీర్, షేక్ యాసిన్ ముగ్గురు ఒకే వీధిలో కుటుంబాలతో అద్దె గృహాల్లో నివాసముంటున్నారు. ఇంద్దాత్ తండ్రి మరణించడంతో కుటుంబానికి పెద్దదిక్కయ్యాడు. పదో తరగతి వరకు చదివి కుటుంబ భారం మీద పడటంతో చదువును వదిలేసి టైల్స్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సమీర్ తండ్రి ఆరోగ్యం సరిగా లేకపోవడం, అన్నకు పెళ్లై వేరు కాపురం పెట్టడంతో కుటుంబాన్ని పోషించాల్సిన బాధ్యత తనపై పడింది. యాసిన్ పేద కుటుంబానికి చెందిన వాడే కావడంతో ముగ్గురూ టైల్స్ పని చేసేవారు. ప్రతిరోజూ స్నేహితులు అందరూ కలిసి పనులకు వెళ్లి వచ్చి సాయంత్రం వేళ వీధిలో అందరినీ పలకరిస్తూ సంతోషంగా గడిపేవారు. స్నేహితుడి చెల్లి వివాహ విందు కావడంతో కారులో వెళ్లి వస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తమను పోషించే బిడ్డ దూరమయ్యాడని, తమకు దిక్కెవరని ఆ కుటుంబాల రోదనలు మిన్నంటాయి. నిత్యం తమతో సరదాగా మాట్లాడుతూ ఉండే పిల్లలు మరణించారనే వార్తను చుట్టుపక్కల వారు జీర్ణించుకోలేకపోయారు. ఇక చేతికి అందివచ్చిన కొడుకులను కోల్పోయిన ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

ఓదార్చిన మంత్రి పువ్వాడ..

కారు ప్రమాదంలో ముగ్గురు యువకుల మరణ వార్త తెలుసుకున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం ఖిల్లాలోని వారి నివాసాలకు వెళ్లి కుటుంబాలను కలిసి ఓదార్చారు. ప్రమాదం జరిగిన తీరు, వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతులంతా పేద కుటుంబాలకు చెందిన వారు కావడంతో వ్యక్తిగతంగా తక్షణ సాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.75 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. ప్రభుత్వం తరపున కుటుంబంలో ఒకరికి స్వయం ఉపాధి కింద సబ్సిడీ రుణాలు ఇప్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రకటించిన ఆర్థిక సాయాన్ని మంత్రి పీఏ సీహెచ్ రవికిరణ్ మృతుల కుటుంబసభ్యులకు అందజేశారు. వారి వెంట సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్ అలియా షౌకత్ అలీ, ఖమర్, తాజుద్దీన్, తౌసిఫ్, అక్మల్ అలీ, జిలానీ, కాఫిల్, ఇసాక్, ఇజార్, జియాఉద్దీన్, అఫ్సర్, వసీం, సలీం ఉన్నారు.

నేలకొండపల్లిలో దొంగల రెక్కీ?

నేలకొండపల్లి: రెండు రోజుల కిందట నేలకొండపల్లిలో ఒకే రోజు భారీ ఎత్తున చోరీలు జరిగిన విషయం విదితమే. ఆ భయం మరవక ముందే తాజాగా ఆదివారం పట్టపగలు దుకాణాలు, ఇళ్లపై రెక్కీ జరిగినట్లు తెలుస్తోంది. మండల కేంద్రంలోని రెండు రోజుల కిందట మూడు చోట్ల చోరీలు.. రెండు చోట్ల చోరీయత్నాలు చోటుచేసుకున్నాయి. దీతో నేలకొండపల్లి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఆదివారం పట్టపగలే యువకులు బైక్‌పై బ్యాంక్ ఎదురుగా ఉన్న వీధిలో దుకాణాలు, ఇళ్లను ఫొటోలు తీస్తున్నారు. ఆదివారం కావడంతో పలు దుకాణాలు మూసి ఉంచారు. ఇళ్లలో ఉన్న వారు అనుకోకుండా బయటకు రావటంతో ఇరువురు యువకులు వీధిలోని ఇళ్లను, దుకాణాలను ఫొటోలు తీస్తూ కనిపించారు. వెంటనే ప్రజలు అప్రమత్తమై వారిని ప్రశ్నించేలోపే వారు పారిపోయారు. ఈ రెక్కీ విషయం నేలకొండపల్లి పట్టణంలో సంచలనం సృష్టించింది. పట్టణ ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు గస్తీ పెంచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.